క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సేవగుణాన్ని అలవర్చుకోవాలి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న గణపతిరావు

విజయనగరం ఫోర్ట్: ప్రతీ ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని వ్యాపారవేత్త లోక గణపతిరావు అన్నారు. స్థానిక కణపాక అగుర వీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో 50 మంది పేదలకు బియ్యం, గోధుమనూక, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం తరఫున 15 ఏళ్లుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అప్పలస్వామి, నాగరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రుణాలు ఇప్పించండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

శృంగవరపుకోట: అవసరం మేరకు డ్వాక్రా పొదుపు సంఘాలకు అంతర్గత రుణాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి బ్యాంకర్లను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.కోట, జామి, ఎల్.కోట మండలాల బ్యాంకు మేనేజర్లు, ఐకేపీ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి సంఘానికి అంతర్గత రుణాలు ఇవ్వాలని, అవసరం మేరకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బ్యాంకులకు వచ్చే మహిళలకు మర్యాద, మన్నన, గౌరవమిచ్చి వాళ్ల పనులు త్వరగా పూర్తిచేసి పంపేలా చూడాలని ఆయన బ్యాంకర్లను కోరారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎన్.ఆదియ్య, ఏపీఎంలు పాల్గొన్నారు.

చురుగ్గా ఏపీజీఈఏ సభ్యత్వ నమోదు

చీపురుపల్లి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందని ఆసంఘం అధ్యక్షుడు పిన్నింటి హరి చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలో మంగళవారం ప్రారంభించారు. గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు సభ్యత్వ నమో దుకు ముందుకొచ్చారని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే సంఘంలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు ఉండాలన్నారు. అందుకనే ఉద్యోగులంతా ఏపీజీఈఏ సంఘంలో చేరాలని కోరారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంక టరమణ, జిల్లా సంయుక్త కార్యదర్శి గిడిజాల లక్ష్మనాయుడు, గౌరవ అధ్యక్షుడు కర్రోతు విశ్వేశ్వరరావు, మండల కార్యదర్శి చిప్పాడ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు జి.సూర్యకుమారి, ఆర్.ఎల్.వరప్రసాద్, ఎల్.రామమోహన్, ఎస్.ఈశ్వరరావు, కె.యశోద తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.1.3లక్షల వితరణ

విజయనగరం అర్బన్: పట్టణానికి చెందిన తిలక్ ఫౌండేషన్ సభ్యులు జిల్లాలోని పేద ప్రజలకు అన్నదానానికి రూ.1.30 లక్షల చెక్కును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఎమ్మెల్యే అదితిగజపతిరాజు చేతుల మీదుగా మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. తిలక్ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర ప్రసాద్ రూ.లక్ష, కందాల సాయిబాబా హైమావతి దంపతులు రూ.30 వేలు కలిపి రూ.1.30 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో తిలక్ ఫౌండేషన్ అధ్యక్షుడు, న్యాయవాది ఎస్ఎస్ ఎస్ఎస్ రాజు, ఎన్.వెంకటేశ్వర ప్రసాద్, కందాల సాయిబాబా, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి.. ఇచ్చేనా...

- కూటమి ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతిపై యువత ఆశలు
- ప్రభుత్వం ఏర్పడి నెల దాటుతున్నా నిరుద్యోగ భృతి ఊసెత్తని వైనం



విజయనగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతిపై యువత ఆశలు అడియాశలుగా మారుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన ఆరు హామీల్లో నిరుద్యోగ భృతిపై ఇప్పటి వరకు ప్రకటన చేయకపోవటం పట్ల నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2009 – 14 హయాంలో అప్పటి ఎన్నికలకు ముందు ఇదే తరహాలో చంద్రబాబు నిరుద్యోగ భృతి, ఇంటికొక ఉద్యోగమంటూ యువతను మోసగించిన వైనాన్ని మరోసారి గుర్తు చేసుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పట్లో ఇంటికొక ఉద్యోగమంటూ నిరుద్యోగ యువతను నిట్టనిలువునా మోసం చేశారు. అయితే 2024 ఎన్నికలకు ముందు నేను మారానంటూ మరో సారి పాత సీసాలో కొత్త సారా వేసిన చందంగా నిరుద్యోగ భృతి హామీ పట్ల నిరుద్యోగులంతా ఆకర్షితులై ఓట్లు వేయగా... ఈ పథకం అమలు పట్ల నిబంధనలు ప్రకటించకపోవటం అనుమానాలకు తావిస్తోంది. నెలకు రూ.3వేలు చొప్పున భృతి ఇస్తామని ప్రకటించటం మినహా విద్యార్హతలు, వయస్సు నిబంధనలు స్పష్టం చేయకపోవటం గమనార్హం. దీంతో గతంలో మాదిరి ఈ దఫా కూడా నిరుద్యోగ భృతి హామీ గాల్లో కలిసిపోతుందా అన్న ఆందోళన నెలకొంటుంది. విజయనగరం నియోజకవర్గం పరిధిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు విజయనగరం మండలం ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 85వేల కుటుంబాలు ఉంటాయని అంచనా. కుటుంబంలో ఒక్కో నిరుద్యోగస్తుడున్నా వేలాది మందికి కూటమి ప్రకటించిన భృతి అమలు చేయాల్సి ఉంటుంది. నిరుద్యోగ భృతి విషయంలో వయో పరిమితి విధించకుండా పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. వీరిలో అత్యధికంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పోటీ పరీక్షలకు పోటీ పడి విఫలమైన వారు అధికంగా ఉంటారు. వారందరికీ పథకాన్ని అమలు చేసి న్యాయం చేయాలన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇచ్చిన హామీ అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించటంతో పాటు సూపర్‌సిక్స్‌లో ప్రకటించిన రూ.3వేల నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తయినా ఇప్పటి వరకు ఎక్కడా నిరుద్యోగ భృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రస్తావించటం లేదు. గతంలో మాదిరి మోసం చేయాలని ఆలోచిస్తే తగిన గుణపాఠం చెబుతాం.

– కోట. సతీష్, విజయనగరం

మాట నిలబెట్టుకోవాలి



2024 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన నిరుద్యోగ భృతిపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. నిరుద్యోగ భృతి పట్ల ఆకర్షితులై లక్షలాది మంది ఓట్లు వేశాం. సంక్షేమ పథకాలతో పాటు భృతి పట్ల తొందరగా నిర్ణయం తీసుకుని అమలు చేయాలి. ఈ పథకం కోసం ఎంతో మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ముందుస్తుగా ప్రకటించిన విధంగా నిరుద్యోగులందరికీ న్యాయం చేయాలి.

– సిహెచ్.శ్రీహర్షిణికుమారి, విజయనగరం.

గతంలోనూ ఇలాగే...

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు. హామీ అమలులో తాత్సారం చేస్తున్నారు. గతంలోనూ ఇలాగే నిరుద్యోగ భృతి ఇవ్వకుండా గడిపేశారు. నిరుద్యోగులు భృతి కోసం ఎదురు చూస్తున్నారు. సీఎం చంద్రబాబు నిరుద్యోగులను ఆదుకుంటారని ఆశిస్తున్నాను.

– మజ్జి శంకర్రావు, అలబానవీధి, నెల్లిమర్ల

ఈసారైనా నిరుద్యోగ భృతి ఇస్తారా?



2014 ఎన్నికల్లో నిరుద్యోగులకు ప్రతీ నెలా రూ. 2 వేలు నిరుద్యోగ భృతి అందిస్తానని చెప్పి అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం, ఐదేళ్ల కాలంలో ఆ హామీ ఊసే ఎత్తలేదు. 2024 ఎన్నికల మేనిఫేస్టోలో మరోసారి కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఊరు వాడా ప్రచారంలో హామీనిచ్చారు. ఆయన ప్రచారంలో వెనకే ఉన్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎన్నికల హామీలను నెరవేర్చుతామన్నారు. తీరా అధికారం చేపట్టి నెల రోజులు గడిచినా ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ ఊసే ఎత్తడం లేదు. దీంతో మా నిరుద్యోగుల్లో నిరుత్సాహం నెలకొంది. ఎన్నికల హామీ బుట్టదాఖలు కాకుండా ఈ నెలలోనైనా నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి.

– పూసర్ల రవికుమార్, సారిక గ్రామం, విజయనగరం మండలం

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విజయకళ్యాణి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విజయకళ్యాణి

నెల్లిమర్ల రూరల్: బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు శిక్షలు పడేలా చట్టాలు పటిష్టంగా ఉన్నాయని, వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి అన్నారు. మండలంలోని సీతారామునిపేట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని అందిస్తామన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు పార్టీల స్నేహపూర్వక వాతావరణంలో కేసులు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే జరిమానా, శిక్ష విధిస్తామన్నారు. లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య మాట్లాడుతూ ప్రజా ఉపయోగ సేవలైన విద్యుత్, బ్యాంకింగ్, రైల్వే, వాయు రవాణాల్లో వినియోగదారులకు జరిగిన నష్ట పరిహారం రూ.కోటి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ రామారావు, ఏఎస్ఐ రమణమూర్తి, సర్పంచ్ ప్రతినిధి రాం బార్కి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కివరంలో గ్రామదర్శిని రేపు

దెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం ఈ నెల 18వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ లవరాజు తెలిపారు. ప్రతీ గురువారం మండలంలోని ఒక గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిని పరిశీలిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను పరిశీలిస్తామని తెలియజేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి తదితర వాటిని పరిశీలించనున్నట్టు తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా రుపొందించాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: పిల్లలు, యువతలో డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడం ద్వారా జిల్లాను డ్రగ్స్, మత్తు పదార్థాల రహితంగా రుపొందించే దిశగా అధికారులంతా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పిల్లల వ్యవహారి శైలి, నడవడికను ఇంటి వద్ద వారి తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరంతరం గమనిస్తూ ఉండాలని చెప్పారు. పిల్లల ప్రవర్తనలో ఏమైనా మార్పులు గమనిస్తే వెంటనే అప్రమత్తం కావాల్సి ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం అధికంగా ఉంటుందన్నారు. వసతిగృహాల్లో విద్యార్థులు, యువతపై నిఘా ఉంచాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ సుమబాల, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, జిల్లా బాలల సంక్షేమ కమిటి చైర్మన్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ



శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహిస్తున్న అమ్మాజీని సత్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయం చదురుగుడి పక్కన ఉన్న ఆధ్యాత్మిక కళావేదిక వద్ద టి.అమ్మాజీ శాస్త్రీయ సంగీత గాత్రకచేరీ ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం రావివలసకు చెందిన శ్రీరామ కోలాట బృందం చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



పోలీస్ బందోబస్తు మధ్య విచారణ చేస్తున్న ఎస్.కోట ఏపీడీ శారదాదేవి

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రామానికి చెందిన వేతనదారులు గత నెలలో అప్పటి కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. వేతనదారుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఉపాధి హామీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అప్పటిలో అధికారులు విచా రణ చేపట్టలేదు. ఆతర్వాత కలెక్టర్ నాగలక్ష్మికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో జిల్లా కలెక్టర్‌గా వచ్చిన అంబేడ్కర్ ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఆదేశిస్తూ, తహసీల్దార్ రమాదేవిని విచారణ అధికారిగా నియమించారు. ఈనెల 9న పాల వలస సచివాలయంలో తహసీల్దార్ విచారణ చేపట్టారు. కానీ నేటికి నివేదికను కలెక్టర్‌కు అందించలేదని సమాచారం. దీంతో కలెక్టర్ ఆదేశా లతో ఎస్.కోట ఉపాధి హామీ ఏపీడీ శారదాదేవి పాలవలసలో మంగళ వారం విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణకు తమను హాజరు కాకుండా చేసేందుకు కూటమి నేతలు విఫలయత్నం చేశారని, పోలీసులను భారీగా గ్రామంలో దించి భయభ్రాంతులకు గురుచేశారని వేతన దారులు ఆరోపించారు. అయినప్పటికీ వేతనదారులు విచారణకు హాజరయ్యారు. పోలీసు బందోబస్తు మధ్య అధికారులు విచారణ చేశారు. వారానికి రూ.50 నగదుచెల్లించాలని, కొత్త జాబ్ కార్డుకు రూ.500 ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ తమను డిమాండ్ చేస్తున్నారని, మాట వినని వారి జాబ్ కార్డులు తొలగిస్తామని భయపెడుతున్నట్లు వేతనదారులు అధికారులకు చెప్పారు. మాట వినకుంటే ఇష్టం వచ్చినట్లు దుర్భాషలు ఆడేవాడని వాంగ్మూలం ఇచ్చారు. విచారణ నివేదికను గత అధికారులు చేసిన విచారణ నివేదిక కంటే ముందుగా కలెక్టర్‌కు అందించాలని వేతన దారులు కోరారు. ఏపీఓ కామేశ్వరరావు, జిల్లా ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణ



వివిధ రకాల కూరగాయల అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి



శాకంబరీదేవీగా తోటపాలెం ముత్యాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళ వారం ఆలయ చైర్మన్ చలం, కార్యదర్శి కామరాజుల ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. తోటపాలెంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారు శాకంబరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. బొగ్గులదిబ్బలో కొలువైన పైడితల్లి అమ్మవారికి ఘటాలతో నివేదన చేశారు. టీటీడీ ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పీవీ నరసింహాచార్యులు తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించి, తరించారు.

పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి



25వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: కాలువల్లో పేరుకుపోయిన పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశించారు. స్థానిక 25వ డివిజన్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కాలువలలో పూడిక చేరి ఇబ్బందికరంగా మారిందన్న ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్, ప్రజారోగ్య సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. రైల్వే స్టేషన్, వనంగుడి ప్రాంతంలో ఉన్న కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తక్షణం తొలగించాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై మండిపడ్డారు. ప్రతిరోజు తమ సచివాలయ పరిధిలో ఉన్న కాలువలు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న దుకాణదారులు కూడా చెత్తాచెదారాలను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని చెప్పారు. కాలువల్లో చెత్తలు వేసినట్లు గమనిస్తే అపరాధ రుసుము వసూలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాయుడు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో కాలువల ద్వారా వర్షపు నీరు సజావుగా ప్రవహించే విధంగా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అయితే కొన్నిచోట్ల కాలువల్లో చెత్తాచెదారాలు వేయడంతో పూడిక పేరుకుపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వాటిని తక్షణమే ప్రక్షాళన చేసే విధంగా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు



నెల్లిమర్ల హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతంలో పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలో రోజు విడిచి రోజు నీటిని పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నెల్లిమర్ల హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతానికి చేరుకొని అక్కడ నీటి సామర్థ్యం, స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం నీటి పంపిణీకి అవసరమైన అదనపు నీటిని ఆంధ్ర నుండి రప్పించేందుకై కలెక్టర్‌కు నివేదించారు. ఆంధ్ర నుండి మూడు నాలుగు రోజుల్లో అదనపు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి పంపిణీకి అవసరమైన 16 ఎం.ఎల్.డి. నీరు అందుబాటులో ఉందన్నారు. అదనపు నీరు అందుబాటులోకి వస్తే రానున్న 15 రోజుల తర్వాత కూడా యధా ప్రకారం రోజు విడిచి రోజు సకాలంలో నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు ఉండవని కమిషనర్ నాయుడు ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఈఈ కే శ్రీనివాసరావు, డిఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



ఇసుకరీచ్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

తెర్లాం: మండలంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ అధికారులను ఆదేశించారు. మండలలలోని కుసుమూరు వేగావతి నది వద్ద ఉన్న ఇసుకరీచ్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రస్తుతం ఇసుకరీచ్‌లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా, లేదా అని తహసీల్దార్ రాజ్యలక్ష్మని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఆర్డీఓ ఆదేశించారు. రాత్రి వేళల్లో నాటుబళ్లపై ఇసుకను తరలించే వారిపై నిఘా పెట్టాలన్నారు. మండలంలోని కుసుమూరు, నందబలగ ఇసుకరీచ్‌ల్లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదని, అక్రమంగా ఇసుక తరలించే వారిపై దృష్టి సారించాలని తెలిపారు. ఇసుకరీచ్‌ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు గ్రామస్థాయి అధికారులతో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, హెచ్‌డీటీ భాస్కరరావు, వీఆర్‌ఓలు ఉన్నారు.